క్లుప్తంగా

ఫీవర్ సర్వే పూర్తి చేయాలి



సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

మద్దికెర : గ్రామాలలో వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వ వైద్యాధికారులు రాగిణి, శ్రీలక్ష్మి సూచించారు. మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో ఫీవర్ సర్వేను శుక్రవారం వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందువల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని, ఆశా కార్యకర్తలు అప్రమత్తంగా ఉంటూ ప్రజలను చైతన్న పరచాలని సూచించారు. జ్వరం, ఒళ్లు నొప్పులు ఉంటే వెంటనే ప్రభుత్వ వైద్యశాలలో సంప్రదించేలా చూడాలన్నారు.

గాయత్రీ మాతకు పూజలు

ఆస్పరి: రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత ఆలయంలో, ఆస్పరిలోని మారెమ్మవ్వకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అర్చకులు రూపామోహన్ శర్మ, గోవిందు ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర పూజలు చేపట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగింపును పరిశీలిస్తున్న ఎంపీడీఓ, పంచాయతీ అధికారులు

మద్దికెర : స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద రోడ్డుకు అడ్డంగా అక్రమంగా ఏర్పాటు చేసిన బంకులను శుక్రవారం పంచాయతీ సిబ్బంది తొలగించారు. విద్యార్థులతోపాటు వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారన్న ఫిర్యాదుల మేరకు ఆక్రమణలు తొలగింపు చేపట్టామని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ స్వర్ణలత, సర్పంచ్ బండారు సుహాసిని తెలిపారు. బంకులు, బండ్లు పెట్టుకొని జీవనం సాగిస్తున్న వ్యాపారులకు ప్రత్యామ్నాయం కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు విష్ణు, చంద్రశేఖర్, మాజీ జెడ్పీటీసీ రాజన్న, ఆంజనేయులు పాల్గొన్నారు.

వేదమూర్తి శ్రీశ్రీ రామలింగేశ్వరస్వామి మృతి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కర్ణాటక మాజీ మంత్రి బి.శ్రీరాములు

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలోని పంచాగకర్త, వేదమూర్తి శ్రీశ్రీ రామలింగేశ్వరస్వామి(68) శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న కర్ణాటక మాజీ మంత్రి బళ్లారి శ్రీరాములు, జె.హొసళ్లి పీఠాధిపతి శంబులింగయ్యస్వామి, వీరాపురం జడప్పతాత, ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి తనయుడు చంద్రశేఖర్ తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. తాతను ఆఖరిచూపు చూడడానికి ఆంధ్ర, కర్ణాటక నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



లైన్‌మెన్‌ను సన్మానించిన విద్యుత్‌శాఖ సిబ్బంది

హాలహర్వి: మండలంలోని కొక్కరచేడు గ్రామంలో విద్యుత్‌శాఖ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న హెచ్.రంగప్ప గత నెల 15వ తేదీన స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ లైన్‌మెన్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అవార్డు గ్రహీతను ఏడీఈ పురుషోత్తం, ఏఈ జంబన్న ఆధ్వర్యంలో తోటి ఉద్యోగులు పూలమాలలు, దుశ్శాలువాలు వేసి ఘనంగా సన్మానించారు.

ట్రైసైకిళ్లు అందజేస్తాం



ట్రైసైకిళ్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

మద్దికెర: జనవరిలో జిల్లా అధికారులు దివ్యాంగులకు ప్రత్యేకంగా వైద్యశిబిరం ఏర్పాటు చేసి వారికి అవసరమయ్యే పరికరాలు గుర్తించారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రం మద్దికెరకు సరఫరా అయిన బ్యాటరీ ట్రైసైకిళ్లు, హెల్మెట్లు, హియరింగ్ యంత్రాలను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పరిశీలించారు. జిల్లా అధికారుల ఆదేశాలు వచ్చిన వెంటనే జాబితా ప్రకారం లబ్ధిదారులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తామని ఈ సందర్భంగా ఎంపీడీఓ తెలిపారు.

వినాయక చవితి సందడి

- నేడు వినాయక చవితి
- కొలువుదీరనున్న బొజ్జగణపయ్యలు
- ముస్తాబైన మండపాలు



పత్తికొండ ఊరువాకిలి వద్ద సిద్ధం చేసిన మండపం



పత్తికొండలో గణేష్ విగ్రహాన్ని ట్రాక్టర్లో తరలిస్తున్న నిర్వాహకులు



మద్దికెరలో కొలువుతీరనున్న మట్టి వినాయకుడు

పత్తికొండ(తుగ్గలి) : మండల కేంద్రం పత్తికొండతో పాటు గ్రామాల్లో వినాయక చవితి సందడి నెలకొంది. భక్తకోటి ఇష్టదైవం బొజ్జ గణపయ్యలు కొలువుదీరేందుకు సిద్ధమయ్యారు. శనివారం వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు మండపాలు ముస్తాబయ్యాయి. గణపయ్యను ప్రతిష్ఠించడానికి ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశారు. గణపతి ప్రతిమలను కొనుగోలు చేసి ట్రాక్టర్లు, ఆటోల్లో మండపాలకు తరలించారు. గణపతి ప్రతిమలు, పూజా సామాగ్రి కొనుగోలు కోసం వచ్చిన భక్తులతో మార్కెట్ సందడిగా మారింది. ఉత్సవ కమిటీలు మండపాల దగ్గర అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులు సూచిస్తున్నారు. సొంత విద్యుత్ పనులతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ఎలక్ట్రీషియన్‌తోనే పనులు చేయించి ప్రమాదాలకు చెక్ పెట్టాలంటున్నారు. ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే ఆనందంగా ఉత్సవాలు పూర్తి చేసుకోవచ్చంటున్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

మద్దికెర : మండల కేంద్రం మద్దికెరలో శుక్రవారం ఆపద్బాంధవ సేవా సమితి అధ్యక్షుడు చొక్కా సునీల్ కుమార్ మట్టి వినాయకుల ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఈ సందర్భంగా ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సేవాసమితి కార్యదర్శి రవాకుమార్, సభ్యులు శ్రీకాంత్, హరి, నరేష్ పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

తుగ్గలి : ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని తుగ్గలి ఎస్ఐ కృష్ణమూర్తి సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ మండపాల నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఉత్సవాలు ముగిసేవరకు నిర్వాహకులు మండపాల వద్ద కాపలా ఉండాలన్నారు. సమస్యలుంటే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

కృష్ణగిరి: బొజ్జ గణపయ్య విగ్రహాలను కొలువుంచేందుకు మండల కేంద్రం కృష్ణగిరితోపాటు పల్లెల్లో మండపాలు ముస్తాబయ్యాయి. మండపాలలో గణనాథుడి కొలువు, నిమజ్జన సమయంలో పాటించాల్సిన నిబంధనలను ముందస్తుగా అధికారులు నిర్వహకులకు తెలియజేశారు. 9వ తేదీ ఆయా గ్రామాల సమీపంలోని కాలువలు, కుంటలు, చెరువుల్లో నిమజ్జనాన్ని చేపట్టేలా నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.



చిప్పగిరి మండలంలోని నంచర్లలో సిద్ధమైన వినాయక మండపం


మద్దికెర : వినాయక చవితి ఉత్సవాలు శనివారం ప్రారంభం కానున్న నేపథ్యంలో మండల కేంద్రం మద్దికెరతోపాటు గ్రామాల్లో మండపాలు ముస్తాబయ్యాయి. స్థానిక కురువ వీధిలోని ఎలగురిగప్ప దేవాలయంలో మండపం ముస్తాబు చేశారు. మట్టి విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు యూత్ సభ్యులు తెలిపారు. హోస్పేట నుంచి రూ. 20 వేలు వెచ్చించి మట్టి విగ్రహాన్ని తీసుకొచ్చామన్నారు.



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న సునీల్ కుమార్

చిప్పగిరి: వినాయక చవితి సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో వినాయక విగ్రహాల ఏర్పాటుకు యువకులు, ప్రజలు పెద్ద ఎత్తున మండపాలను సిద్ధం చేశారు. శుక్రవారం విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు మండలంలోని నేమకల్లు, దౌల్తాపురం, నంచర్ల, గుమ్మనూరు, బంటనహాలు, రామదుర్గం, నగరడోణ, బెల్డోణ తదితర గ్రామాల్లో వినాయక మండపాలు సిద్ధంగా ఉన్నాయి. మండలంలో మొత్తం 100కు పైగా విగ్రహాల ఏర్పాటు చేస్తున్నట్లు వినాయక కమిటీ సభ్యులు తెలిపారు.

వినాయక చవితి శుభాకాంక్షలు



బుసినే విరూపాక్షి, ఎమ్మెల్యే,ఆలూరు

ఆలూరు రూరల్: వినాయక చవితి సందర్భంగా ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గ ప్రజలందరికీ ఆ గణనాథుని ఆశీస్సులు ఉండాలని, అందరికీ ఆయురారోగ్యాలు, సకల సంపదలు సిద్ధించి, శుభాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు. విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో మంచి పనులకు విఘ్నాలు తొలిగిపోయి, విజయాలు సిద్ధించాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



డాక్టర్ వాహీద్

ఆలూరు: భారీ వర్షాల వల్ల అంటు వ్యాధుల బారిన పడకుండా ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆలూరు ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ వాహీద్ సూచించారు. స్థానిక సీహెచ్‌సీలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కాచి చల్లార్చిన నీటి నే తాగాలన్నారు. మురుగునీరు నిలువ ఉండకుండా, దోమలు వృద్ధిచెందికుండా చూసుకోవాలన్నారు.

ట్యాంకులను శుభ్రం చేయించాలి

ఆలూరు: పంచాయతీ పరిధిలోని జీఎల్ఆర్, ఓహెచ్ఆర్ ట్యాంకులను వారంలో ఒక్కసారైనా బ్లీచింగ్ పౌడర్‌తో గ్రామపంచాయతీ కార్యదర్శులు శుభ్రం చేయించే బాధ్యతను తీసుకోవాలని పత్తికొండ డివిజన్ పంచాయతీల ఇన్‌చార్జ్ అధికారి ప్రకాష్‌నాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లోని గ్రామపంచాయతీల్లోని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు, కార్మికులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లపై ఉందన్నారు.

టీబీ డ్యాం నుంచి 12 గేట్ల ద్వారా నీటి విడుదల



నిండుకుండలా తుంగభద్ర రిజర్వాయర్

హొళగుంద: టీబీ డ్యాం నుంచి శుక్రవారం కూడా 12 గేట్లతో నదికి నీటి విడుదల కొనసాగుతోంది. భారీ వర్షాల కారణంగా తుంగభద్రకు పెద్ద ఎత్తున వరద పోటెత్తడంతో గత మూడు రోజులుగా టీబీ బోర్డు ఇంజినీర్లు డ్యాం గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం పరివాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు బుధవారం నుంచి రెండు రోజులు 10 గేట్లు, శుక్రవారం నుంచి 12 గేట్లను అడుగు మేర ఎత్తి 22,773 క్యూసెక్కులను నదికి, కాలువలకు 10 వేల క్యూసెక్కులను కలిపి మొత్తం 32,047 క్యూసెక్కుల నీటిని డ్యాం నుంచి కిందకు వదులుతున్నారు. తుంగభద్ర డ్యాంలో 1,633 అడుగులకు గాను 1,632 అడుగులు.. 105.788 టీఎంసీలకు గాను 101.773 టీఎంసీల నీరు నిల్వ ఉండగా ఇన్‌ఫ్లో 32,347 క్యూసెక్కులుంది. డ్యాంకు రాత్రికి ఇన్ ఫ్లో తగ్గే అవకాశాలుండడంతో శనివారం కొన్ని గేట్లను తగ్గించే అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు. దిగువ కాలువ(ఎల్లెల్సీ)కు ఆంధ్రా సరిహద్దు 250 కి.మీ వద్ద 681 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు.

వెల్దుర్తిలో దొంగల హల్‌చల్



చోరీ జరిగిన సాయిరాం సీడ్స్ దుకాణం

వెల్దుర్తి: పట్టణంలో గురువారం రాత్రి దొంగలు హల్‌చల్ సృష్టించారు. ఎక్కడ పడితే అక్కడ తాళం వేసి ఉన్న దుకాణాలలో చోరీలకు ప్రయత్నించారు. శుక్రవారం ఉదయం తమ షాపులను తెరుచుకునేందుకు వెళ్లిన యజమానులు విషయం తెలుసుకుని లబోదిబోమంటున్నారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ సమీపంలోని సాయిరాం సీడ్స్ దుకాణం షట్టర్ తాళాలు పగులగొట్టిన దొంగలు క్యాష్ కౌంటర్‌లోని రూ.5వేలు దోచుకెళ్లారు. ప్రక్కనే ఉన్న శ్రీలక్ష్మీ నరసింహ ఫర్టిలైజర్స్ షాప్, ప్రకాశ్ పశువుల దాణా షాపులను, డోన్ రైల్వే గేట్ సమీపంలోని దుకాణాల తాళాలను పగులగొట్టి చోరీ ప్రయత్నం చేశారు. తెల్లవారుజామున నారాయణ రెడ్డి నగర్ ఎదుట కూల్‌డ్రింక్‌షాప్ షెట్టర్ తాళాలను దొంగలు పగులగొడుతుంగా స్థానికులు కేకలు వేయడంతో పారిపోయారు. ఆయా షాప్‌లలో ఎలాంటి నగదు, వస్తువుల చోరీ జరుగలేదని యజమానులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మట్టిమిద్దె కూలి మహిళకు గాయాలు

వెల్దుర్తి: ఇటీవలి కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని రామళ్లకోట గ్రామం దాసరి పేటలో శుక్రవారం రాత్రి పింజరి నడిపెన్నకు చెందిన మట్టిమిద్దె కూలింది. ఆ సమయంలో వంట చేస్తున్న అతని భార్య పింజరి జైనబ్ బీపై మిద్దె పడడంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. కూలిన మిద్దెభాగాలను తొలగించిన భర్త, చుట్టు పక్కలవారు గాయపడ్డ జైనబ్‌బీని హుటాహుటిన వెల్దుర్తి సీహెచ్‌సీకి తరలించారు. జైనుబ్‌బీ రెండు కాళ్లు విరగడంతోపాటు చేతికి తీవ్ర గాయమైనట్లు ప్రథమ చికిత్స అందించిన వైద్యులు తెలిపారు. క్షతగాత్రురాలిని మెరుగైన చికిత్సకు 108లో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దాదాపు రూ.లక్ష ఆస్తి నష్టం సైతం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.



గాయపడిన జైనుబ్‌బీ

రైతులను ఆదుకోవాలి

ఆస్పరి: మండలంలో ఆస్పరి, ముత్తుకూరు, పుటకలమర్రి, కై రుప్పల, బనవనూరు గ్రామాల్లో ఇటీవల కురిసిన అధిక వర్షాలు వల్ల పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘం మండల కార్యదర్శి రంగస్వామి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆస్పరిలో రైతు సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. రంగస్వామి మాట్లాడుతూ ఇటీవల మండలంలో కురిసిన భారీ వర్షాలకు హంద్రీ వాగు పొంగి పొర్లడంతో రైతులు సాగు చేసిన పత్తి, వేరుశనగ, ఉల్లి, కూరగాయలు పూర్తిగా దెబ్బతిని ఆర్థికంగా నష్టాలు పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయధికారులు సర్వే చేసి నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9, 10వ తేదీల్లో సచివాలయాలు, 17,18వ తేదీలలో మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాల్లో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు హనుమంతు, మధురెడ్డి, రామాంజినేయులు, ఇస్మాయిల్, మల్లికార్జున,మునిస్వామి, నాగరాజు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



మస్తాన్ వలి, ఆస్పరి సీఐ

ఆస్పరి: మండలంలో గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆస్పరి సీఐ మస్తాన్ వలి తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గణేష్ విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పకుండా తీసుకోవాలన్నారు. నిర్వాహకులు విద్యుత్ స్తంభాల దగ్గర మండపాలను ఏర్పాటు చేయకూడదన్నారు. నిమజ్జనం రోజు డిజేలు, పెద్ద శబ్దాలు వచ్చే డ్రమ్మును పెట్టరాదని సూచించారు. చెరువుల దగ్గరకు చిన్న పిల్లలను తీసుకెళ్లకూడదన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అర్హులైన వారికే స్టాఫ్ నర్స్ పోస్టులు ఇవ్వాలి



మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ రవికి వినతి పత్రం ఇస్తున్న స్టాఫ్ నర్సులు

ఆలూరు రూరల్: మూడేళ్ల పాటు జీఎన్ఎం శిక్షణ తీసుకున్న వారికే స్టాఫ్ నర్సు పోస్టులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ స్టాఫ్ నర్స్ స్ట్రగుల్ కమిటీ సభ్యులు రమాదేవి, మంగమ్మ మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ రవికి శుక్రవారం వినతి పత్రం అందించారు. ప్రభుత్వం నైపుణ్య శిక్షణ పేరుతో ఇంటెన్సిఫైడ్ ప్రోగ్రామ్ ప్రవేశపెట్టి 18 నెలల పాటు నామమాత్రపు శిక్షణ ఇచ్చి వారికి స్టాఫ్ నర్స్ పోస్టులు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓను వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇంటెన్సిఫైడ్ ప్రోగ్రామ్ ఆపాలని గతంలో మంత్రి నారాలోకేష్, ఆరోగ్యశాఖ మంత్రికి వినతి పత్రం ఇచ్చినా స్పందించడం లేదన్నారు. ప్రస్తుతం తమ హక్కులు కాపాడుకునేందుకు అత్యవసర విధులు మినహాయించి మిగిలిన విధులను బహిష్కరిస్తున్నట్లు చెప్పారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



అనాథలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

హొళగుంద: మండల పరిధిలోని మార్లమడికి, హొళగుంద గ్రామాలకు చెందిన అనాథ వృద్ధులు, దివ్యాంగులు, మరి కొందరికి శుక్రవారం ఆదోని వివేకానంద సేవా సంస్థ, భారత్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. స్వచ్ఛంద సేవా సంస్థల అధ్యక్ష, ఉపాధ్యక్షులు మూర్తి, ప్రకాష్, సిద్ధార్థగౌడ్ ఆధ్వర్యంలో రవికాంత్, గాలెప్ప, శ్రీధర్‌శెట్టి, కిరణ్ తదితరులు బియ్యం, కందిబ్యాళ్లు, వంటనూనె, చక్కర ఇతర సరుకులను అందజేశారు. వీరికి 36 నెలలుగా నిత్యావసర సరుకులు, ఇతర సహాయ సహకారాలు అందిస్తున్నట్లు స్వచ్ఛంద సంస్థ సభ్యులు తెలిపారు.

విద్యుత్ కోతలపై ప్రజల ఆగ్రహం



విద్యుత్ సబ్‌స్టేషన్ సిబ్బందికి వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

హొళగుంద: కొద్ది రోజులుగా విద్యుత్ సరఫరాలో ఇష్టారాజ్యంగా కోతలు విధిస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడ్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని అగ్రహం వ్యక్తం చేస్తూ హొళగుంద ప్రజలు శుక్రవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. గ్రామస్తులు సుభాన్, జప్రుల్లా, పుభాన్, ఫరూక్, అశోక్, మోహిన్, వీరేశ్ తదితరులు మాట్లాడుతూ.. గృహాలు, వ్యవసాయంతో పాటు చిన్నపాటి పరిశ్రమలకు విద్యుత్ సరఫరా విషయంలో కొద్ది రోజులుగా నెలకొన్న సమస్యతో చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇష్టారాజ్యంగా కోతలు విధిస్తుండడంతో పనులు జరగటం లేదని, ఇళ్లలో దోమల బెడద, వర్షాకాలం కావడంతో చీకట్లో విష కీటకాల బెడద తీవ్రంగ ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

లింగాకర్షక బుట్టలతో గులాబీ పురుగు నివారణ



లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసే విధానాన్ని వివరిస్తున్న ఆత్మ డిప్యూటీ పీడీ శ్రీలత

ఆలూరు రూరల్: లింగాకర్షక బుట్టలతో పత్తి పంటకు ఆశించే గులాబీ రంగు పురుగు నివారించవచ్చని కర్నూలు జిల్లా ఆత్మ (అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ) డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీలత రైతులకు అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని కురువళ్లి గ్రామంలో పత్తి పంటకు ఆశించే గులాబీ రంగు పురుగు నివారణపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఎకరాకు 20 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మూడు రోజుల పాటు లింగాకర్షక బుట్టలలో 8 కంటే ఎక్కువ ఉంటే పంటకు ఎక్కువ శాతం పురుగు ఆశించనట్లు నిర్ధారించుకుని పురుగుల మందు పిచికారీ చేయాలన్నారు. పంటకు మందు పిచికారీ చేసేప్పుడు తప్పని సరిగా అందులో వేప నూనె కలపాలని సూచించారు. మండలంలో రైతులకు ప్రయోగాత్మకంగా ఉచితంగా 320 లింగాకర్షక బుట్టలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కురువళ్లి సర్పంచ్ రవి, డిస్ట్రిక్ రిసోర్స్ సెంటర్ ఏడీఏ వెంకటేశ్వర్లు, ఆత్మ ఏఓ మధుమతి, డీఆర్‌సీ ఏఓ శశిధర్ రెడ్డి, ఆలూరు ఏఓ వెంకటేశ్వర గౌడ్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఈ రహదారుల్లో ప్రయాణం నరకప్రాయం



కోతకు గురైన గూళ్యం రోడ్డు



అధ్వానంగా తయారైన నిట్రవట్టికి వెళ్లే రహదారి

- అధ్వానంగా మారిన గ్రామీణ రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

హాలహర్వి: మండలంలోని గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. ఈ రహదారుల్లో ప్రయాణించాలంటే నరకప్రాయంగా మారింది. అటుగా ప్రయాణించేవారు ఎప్పుడు ఏ ప్రమాదానికి గురవుతామేనని భయాందోళన చెందుతున్నారు. మండల కేంద్రమైన హాలహర్వి నుంచి పచ్చారపల్లి, బాపురం, గూళ్యం, జె.హొసళ్లి, సిద్ధాపురం, అమృతాపురం, బల్లూరు గ్రామానికి వెళ్లే రహదారులు ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో ఆ మార్గాల్లో ప్రజలు ప్రయాణించేందుకు జంకుతున్నారు. ప్రయాణించే సమయంలో వాహనం అదుపు తప్పితే ప్రమాదం జరిగే అవకాశం ఉందని భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

తొగలుగల్లు రోడ్డు గుంతలమయం

ఆస్పరి: మండలంలోని యాటకల్లు నుంచి తొగలుగల్లుకు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. 3 కిలోమీటర్లు మేర మోకాల్లోతు గుంతలు పడటంతో వాహనదారులు, పొలాలకు ఎద్దులు బండ్లు తీసుకెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తొగలుగల్లు నుంచి యాటకల్లు మీదుగా మండల కేంద్రమైన ఆస్పరికి రావాలంటే అవస్థలు పడాల్సి వస్తుందని గ్రామస్తులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో రోడ్డు మరింత అధ్వానంగా మారింది. రైతులు పండించిన కూరగాయలును ఆస్పరి, బిల్లేకల్లు మార్కెట్లుకు ఆటోలు, మినీ ట్రక్కుల్లో తీసుకెళ్తారు. రోడ్డు బాగలేకపోవడంతో వాహనాలు మధ్యలోనే గుంతల్లో ఇరుక్కుపోతుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూరగాయలు మార్కెట్‌కు వెళ్లేందుకు ఆలస్యమవుతుండటంతో నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు బాగాలేకపోవడంతో తురువగల్లు, తంగడరడోణ మీదుగా 30 కిలోమీటర్లు చుట్టు తిరిగి ఆస్పరికి రావాల్సి ఉంటుందన్నారు. అదే యాటకల్లు మీదుగా ఆస్పరికి రావాలంటే 10 కిలీమీటర్లే. ఇప్పటికైనా పంచాయితీ రాజ్ అధికారులు యాటకల్లు నుంచి తొగలుగల్లుకు వరకు అప్రోచ్ రోడ్డు వేయించి ఇబ్బందులు తొలగించాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.



తొగలుగల్లు నుంచి యాటకల్లు రోడ్డులో బురదలో ఇరుక్కున్న మినీ ట్రక్కు

విరాళాల సేకరణ

దేవనకొండ: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీపీఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం విరాళాల సేకరణ చేపట్టారు. మండల కేంద్రమైన దేవనకొండలో విరాళాలను సేకరించి సీఎం సహాయ నిధికి పంపుతున్నట్లు సీపీఐ మండల కార్యదర్శి ఎం.నరసారావు, ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు మధు, భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో రాజశేఖర్, కృష్ణ, రామాంజనేయులు, రాజశేఖర్, కృష్ణ, శేఖర్, సురేంద్ర, నరేష్ పాల్గొన్నారు.